ఉప్పుకప్పురంబు

సమయం మధ్యాహ్నం రెండు గంటలు....!

రోహిణీకార్తె ఇంకా ప్రవేశించకపోయినా, ఎండ మాత్రం రోళ్ళు బ్రద్దలయ్యేలా- విరగబడి కాస్తోంది....

ఎర్రని నిప్పులపైనించి వస్తున్న వేడిసెగల్లా వడగాడ్పులు వీస్తున్నాయి.

అలాంటి సమయంలో రైలుదిగి- స్టేషన్లోంచి బయటకువచ్చాడు విశ్వనాథం...

కుడి చేతిలోవున్న సంచిని ఎడంచేతిలోకి మార్చుకుని- పైమీది కండువాతో ఓసారి ముఖం తుడుచుకున్నాడు.... బయట ఎండా- వడ గాడ్పులకు సాయం, లోపల ఆకలి అతని పేగులు కొరికేస్తోంది....

అసలు రైలు సరైన సమయానికి వచ్చివుంటే, ఈపాటికెప్పుడో ఇల్లు చేరుకుని, భోజనం ముగించి, ఓ కునుకు తీస్తూండేవాడు! కానీ, తన దురదృష్టంలాగే, ఆరోజు బండి మూడుగంటలు లేటుగావచ్చింది.-

'ఇంత ఎండలో ఇంటికి ఎలా వెళ్ళటం?'— అనుకున్నాడు విశ్వనాథం- నిర్మానుష్యంగా వున్న తార్రోడ్డు మీదకు చూస్తూ.

అక్కణ్ణించి తన ఇల్లు, మహావుంటే అరమైలు దూరంలో వుంటుంది. చకచకానడిస్తే- పావుగంటలో చేరుకోవచ్చు.

కానీ, అడుగుతీసి అడుగు వేయాలంటేనే— భరించలేనంత నిస్త్రాణగా వుంది విశ్వనాథానికి. అలాంటప్పుడు అరమైలు నడవటమంటే మాటలా ?

ఒకవేళ, తానువెళ్ళినపని విజయవంతంగా పూర్తయివుంటే— వంట్లోకి వెయ్యిఏనుగులబలం వచ్చివుండేది... అప్పుడు ఆకలి, ఎండ, వడగాడ్పులు- మొదలైనవాటిని లక్ష్యపెట్టకుండా పరుగులాంటి నడకతో ఇంటికి వెళ్ళేవాడు.... ఆ శుభవార్తను అలివేలుకి చెప్పి— అదంతా తన ప్రయోజకత్వమేనన్నట్టుపోజు పెట్టేవాడు!...

కానీ ఆపని— అనుకున్నట్టు జరగలేదే!...

మరి ఇప్పుడు ఇంటికి వెళ్ళి- భార్యకు ఏం చెప్పాలి? కథ మళ్ళీ మొదటికి వచ్చిందని చెప్పాలా!... అరుణకు సంబంధం వెతకటానికి మరో కొత్త చెప్పుల జత కొనుక్కోవాలా

'రిక్షా తెమ్మంటారా బాబూ?' అంటూ అంతలోనే పక్కనున్న రిక్షావాలా పలకరించాడు విశ్వనాథాన్ని.

భగవంతుడు ప్రత్యక్షమై 'నీకే వరం కావాలో కోరుకో-' అన్నట్టుగా తోచింది అతనికి... కానీ అదే క్షణంలో అతని నరాల్లో మళ్ళీ నిస్పృత్తువ ఆవరించింది...

ఆ కాస్త దూరమే అయినా- రిక్షావాలా కనీసం రెండు రూపాయలు అడుగుతాడు.

పదేళ్ళ క్రితం ఇలా ఉండేదా పరిస్థితి....?!

అప్పుడు తన ఊళ్ళో పాతికో ముప్ఫయ్యో రిక్షాలుండేవి.... తను ఎప్పుడైనా స్టేషన్లో రైలుదిగి బయటకొస్తే- ఏమీ చెప్పాపెట్టకుండా ఎక్కికూర్చుని 'పోనీయ్' అనేవాడు.

ఇంటి దగ్గర రిక్షాదిగి- ఓ అర్ధరూపాయి బిళ్ళ రిక్షావాలా చేతిలో పెడితే- అదే ఒక వరహాగా భావించి, పొంగిపోయి- తృప్తిగాదాన్ని బనీను జేబులో వేసుకుని- తనకు ఓ నమస్కారం కూడా పెట్టి మరీ వెళ్ళిపోయేవాడు అతను!

ఇప్పుడు రిక్షాలు ఎక్కువైపోయాయి... జనంకూడా పెరిగిపోయారు.... అప్పటి తృప్తి, ఆరకమైన గౌరవం- ఎవరిలోనూ వెతికి చూసినా కనిపించటంలేదు ఇప్పుడు!

అంతా పోటీ బ్రతుకైపోతోంది.... ఎంత వచ్చినా, కొంత వెలితిగానే ఉంటోంది... అసలు ధరలు మండి పోతోంటే వాళ్ళు మాత్రం ఏం చేస్తారు?

'రిక్షా వేస్తాను బాబూ!'– రిక్షావాలా మళ్ళీ హెచ్చరించటంతో ఆలోచనలు వదిలిపెట్టి వాస్తవానికి వచ్చాడు విశ్వనాథం.

'గాంధీ బొమ్మ దగ్గరకు ఏం తీసుకుంటావ్?'- అడిగాడు.

'మీకు తెల్దేటి బాబూ?.... ఎక్కండి!'– అన్నాడు అతను రిక్షాను ముందుకు తెచ్చి.

...

'రెండు రూపాయలిస్తాను! మళ్ళీ అక్కడకు వెళ్ళాక పేచీపెట్టకు! అంటూ ఎక్కికూర్చున్నాడు విశ్వనాథం.

'తమదయ బాబూ! ఈ ఎండలో తొక్కాల!.... అంతామెరక! కట్టం చూసి ఇంకో అద్దరూపాయిచ్చేయండి బాబూ!'– రిక్షావాలా అన్నాడు...

అతనిలోని నమ్రతాభావం విశ్వనాథానికి ఎంతో నచ్చింది. అందుకే మరేమీ బదులు చెప్పలేకపోయాడు... పైగా అతను అడిగిందీ సబబుగానే తోచింది.... తాను హాయిగా రిక్షాలో కూర్చున్నాడు.... అతనుమాత్రం ఆ ఎర్రని ఎండలో, ప్రయాసపడుతూ తనను లాక్కెళ్ళాలి!...

అసలు ఈ రోజుల్లో రెండు రూపాయలకు విలువేముంది?.... ఒకప్పుడు, అప్పుడెప్పుడో తాను కాపురం పెట్టిన తొలిరోజుల్లో పది రూపాయలు పెడితే అయిదుకుంచాల బియ్యం వచ్చేవి. ప్రతి శనివారం నాలుగేసి గుప్పిళ్ళు దానధర్మాలు చేసినా- నెలరోజులకు సరిపోయేవి.... అప్పట్లో రెండు రూపాయలు పట్టుకుని సంతకి వెడితే- నాలుగు సంచుల నిండా కూరలు వచ్చేవి....

ఇప్పుడు రెండు రూపాయల కూరలు కొనుక్కురావాలంటే— రెండు చేతులూ ఊపుకుంటూ వెళ్ళిరావచ్చు.

గుప్తులకాలం ఎలా వుండేదో తనకు తెలియదుకానీ- తాను పెళ్ళి చేసుకుని కాపురం పెట్టిన తొలిరోజులే 'స్వర్ణయుగం' అనుకుంటాడు విశ్వనాథం.

రానురాను కుటుంబం పెరిగింది. అవసరాలు ఎక్కువయ్యాయి. ధరలూ పెరిగిపోయాయి!

తనలాంటి మధ్యతరగతి కుటుంబీకుడు, వచ్చేజీతంలో నిత్యావసరాలు తీర్చుకోలేక సతమతమైపోతూంటే— కూలీనాలీ చేసుకునే అట్టడుగుజనం అర్ధాకలితో ఎలా బతగ్గలుగుతున్నారో— అనుకున్నాడు విశ్వనాథం.

'రోజూ నువ్వెంత సంపాదిస్తావ్?'— అడిగాడు రిక్షావాలాని.

'అంతా గాలివాటం బాబూ! వస్తే ఒకరోజు పాతికా, ముప్పయ్ వస్తాయి.... లేకపోతే పదీ- పరకా కూడా గిట్టుబాటుకాదు!'— ఓచేత్తో నుదుటిమీద పట్టిన చెమట తుడుచుకుంటూ చెప్పాడు.

'సరిపోతుందా మరి?'

'సరిపెట్టుకుంటాం బాబూ!.... ఎక్కువవచ్చినప్పుడు రెండురూపాయలు ఎనకేసుకుంటే— రానప్పుడు సద్దుకోచ్చు!... నా యింటిది కూడా నాలుగిళ్ళల్లో పని చేస్తుంటుంది!'

'పిల్లలెంతమందీ?'— వెంటనే పశ్నించాడు విశ్వనాథం.

'ఇద్దరే బాబూ!.... ఆడపిల్లలు !'

మళ్ళీ మరేం అడగలేదు విశ్వనాథం.

రిక్షా ఎత్తు ఎక్కుతోంది.... ఎండలో రిక్షావాలా నల్లటి శరీరం చెమటలో తడుస్తూ– మెరుస్తోంది.

'నాకు పుట్టింది ఒక్కత్తే బాబూ!... కానీ నాకో చెల్లెలుంది!... దాన్ని కూడా నా బిడ్డలాగే సూసుకుంటన్నా.... అది కూడా నన్ను 'అయ్యా' అనే పిలుస్తాది!.... మాసిన్న తనంలోనే అమ్మ సచ్చిపోయింది!'– మెరకరోడ్డు మీద తొక్కలేక, క్రిందకు దిగి రిక్షాను నెమ్మదిగా లాగుతూ చెప్పాడు.

'పిల్లల్ని చదివిస్తున్నావా ?'

'సదివిస్తున్నాను బాబూ!... సెల్లెమ్మ ఎనిమిదో కళాసు సదూతోంది... నాకూతురేమో ఆరు! ఇద్దరూ అప్ప సెల్లెళ్ళలాగే వుంటారు బాబూ!.... గానం వచ్చిన కాణ్ణించీ నాదగ్గరే వుంటోంది కదా మరీ... అందుకే అది కూడా 'అయ్యా' అని పిలుస్తుంది'– రిక్షాలాగుతూనే వెనక్కి తిరిగి అతను అలా చెప్తూంటే– ఆకళ్ళల్లో వేయిచందమామల కాంతి కనిపించింది...

'పిల్లలు ఏ స్కూల్లో చదువుతున్నారు ?'– అడిగాడు విశ్వనాథం

'ఆంజనేయ సోమి గుడికాడ గోర్నమెంటు ఇస్కూలుంది కదండీ... అందులోనే !'

విశ్వనాథంలో ఉత్సుకత పెరిగింది.... ఆస్కూల్లో ఆరోక్లాసు నించీ తొమ్మిదో క్లాసువరకూ తనే లెఖ్ఖలు చెప్తూంటాడు.... పిల్లలందరూ తనకు తెలుసు. మరి రిక్షావాలా పిల్లలు, వాళ్ళల్లో ఎవరై వుంటారు ?....

'నీ పిల్లల పేర్లేమిటీ?' అడిగాడు.

'పెద్దదాని పేరు అదే... సెల్లెమ్మ పేరు– అమ్మడండి!.... ఎనిమిదోక్లాసు... సిన్నదేమో ఆరోక్లాసు పేరు నూకాలమ్మండి!'

'అలాగా!.... వెరీగుడ్! పిల్లలిద్దరూ తెలివైన వాళ్ళే!.... మంచి మార్కులు వస్తుంటాయి... బాగా చదివించు!'

రిక్షావాలా ఆశ్చర్యపోయాడు.

'అబ్బ.... ఆళ్ళిద్దరూ తమకు తెలుసా బాబూ?' అడిగాడు ఆత్రంగా.

'బాగా తెలుసు! నేను ఆస్కూల్లోనే లెఖ్ఖలు చెప్తూంటాను!.... నీ చెల్లెలు లెఖ్ఖల్లో ఎప్పుడూ ఫస్టే!— నేను అప్పుడప్పుడు అనుకుంటాను అది ఏ గొప్పింట్లోనే పుట్టివుండాల్సిందని!'

'పరవాలేదు బాబూ!.... దానికి అమ్మలేకపోయినా నేనున్నాను. ఏలోటూ లేకుండా పెంచుకుంటున్నా.... అది పరిచ్చలు పేసవుతూ వుండాలేగానీ ఎంతవరకూ సదూకుంటానంటే అంతవరకూ సదివిస్తాను. అవసరమైతే నాగుడిశె... ఇదిగో... ఈరిచ్చా ఇయ్యన్నీ అమ్మేసైనా సరే దానికి పెద్ద చదువు సెప్పిస్తాను బాబూ!....'– ఉత్సాహంగా చెప్తూంటే వాడికళ్ళల్లోకి పెల్లుబికివస్తున్న ఆనందభాష్పాల్ని విశ్వనాథం గమనించలేకపోయాడు.

'అవునూ... మరినీకు ఒక్కత్తే బిడ్డన్నావ్— మరి తర్వాత పిల్లలు పుట్టలేదా?'– అనుమానం వచ్చి... కావాలనే అడిగాడు విశ్వనాథం.

'లేదు బాబూ! మా ఇంటిదానికి ఆప్రేసను చేయించేశాను.... ఇంక పిల్లలు పుట్టరు!'– గర్వంగా చెప్పాడు రిక్షావాలా.

ఆశ్చర్యపోయాడు విశ్వనాథం.

'మరి మగపిల్లలు వద్దా?.... రేపు ఆడపిల్ల లిద్దరికీ పెళ్ళిచేసి అత్తారింటికి పంపించేస్తే– పెద్దవయసులోనిన్నుచూట్టానికి ఒక్క మగ నలుసైనా వుండద్దూ?'

'రేపెప్పుడో మగపిల్లలు మనల్ని సూత్తారని గేరంటీ ఎక్కడ బాబూ! పైగా కన్నాక ఆళ్ళని మనం మంచిగా సూత్తేనేకదా– ఆళ్ళు రేపు మనల్ని సూసేది?... అయినా 'ఈ రోజుల్లో ఎవరైతే ఏందీ' అంది బాబూ నా ఇంటిది! అసలు దరలు ఎలా మండిపోతున్నాయో తవరికి తెలవని ఇసయమా?.... వున్న ఇద్దరు పిల్లలకీ ఇస్కూలు సదువు సెప్పిత్తే, కూతంత తెలివితేటలొస్తాయి.... ఆళ్ళిద్దరూ సుకంగా ఆనందంగా వుంటే– కన్నోళ్ళకు అంతకంటే ఆనందం మరేటివుంటది బాబూ.... ఇక ఆ తర్వాతంటారా, నా రెక్కల్లో బలం వున్నంతవరకూ సంపాదించుకుంటే- మారోజులు ఎళ్ళిపోతాయి!'

'క్రితం జన్మలో ఏ ఆర్థిక తత్వవేత్తో– ఈ జన్మలో ఇలా– ఈ రిక్షావాలాగా పుట్టాడేమో'– అనిపించింది విశ్వనాథానికి ఆక్షణంలో.

తాను ముప్ఫయ్యేళ్లు లెఖ్ఖల మాస్టరుగా పనిచేసినా-విడివడని 'ప్రాబ్లెం'ని క్షణంలో అతను 'సాల్వ్' చేసి చూపించినట్టుగా ఫీలయ్యాడు.

రిక్షా ఎత్తుమీదనించి పల్లంలోకి పరుగులు తీస్తోంది. దాంతో సమానంగా విశ్వనాథం ఆలోచనలుకూడా పరుగులు తీస్తున్నాయి.

"గాంధీ బొమ్మకాడకి వచ్చేశాం!... ఎక్కడ దిగుతారుబాబూ?" అడిగాడు రిక్షావాలా.

విశ్వనాథం ఉలిక్కిపడ్డాడు... గాంధీబొమ్మదగ్గరకు వచ్చేశాడు. అంటే మరో రెండు నిమిషాల్లో తాను ఇంట్లో అడుగుపెడతాడు... ఆత్రంగా తనకు ఎదురువచ్చి 'వెళ్ళిన పని ఏమైంది?' అని ప్రశ్నించే అలివేలుకి తను ఏం బదులు చెప్పాలి?....

అందుకే ఉలిక్కి పడ్డాడు.

'అదిగో...అదే ఇల్లు!....ఆ ఎలక్ట్రిక్ స్తంభం దగ్గర ఆప్చెయ్!" ఇల్లు చూపించాడు.

ఇంటిదగ్గర రిక్షా ఆగింది...క్రిందికిదిగి జేబులోంచి పర్సుతీశాడు విశ్వనాథం. అందులోంచి మూడు రూపాయికాగితాలు తీసి రిక్షావాలాకు ఇస్తూ అన్నాడు-

"ఎండలో కష్టపడి లాక్కొచ్చావ్!... ఈ అయిదు రూపాయలూ తీసుకో!" రిక్షావాలా ఆ డబ్బు తీసుకోలేదు....

"వద్దుబాబూ!... నా బిడ్డలకు సదువుసెప్పే దేవుళ్ళు తవరు!... తవరి దగ్గర డబ్బు తీసుకుంటే నాకళ్ళు పోతాయ్...పైగా మా అమ్మడు సదువులో ఫస్టుంటాదని సల్లటి వోర్త సెప్పారు!.... అదే కోటి రూపాయల విలువబాబూ!.... వుంచండి!"— చేతులు జోడించి చెప్తున్న రిక్షావాలా కళ్ళల్లో -కన్నీళ్ళు కదలటం గమనించాడు విశ్వనాథం... చెల్లెలుపట్ల అతనికున్న ఆపేక్ష ఎలాంటిదో గ్రహించిన విశ్వనాథం పొంగిపోయాడు ..

"అలాకాదు... నామాట విను! '- అంటూ మళ్ళీ డబ్బు ఇవ్వబోయాడు—

"ఇంకేం సెప్పద్దుబాబూ!.... నా బిడ్డలు బాగా సదివేలా సూడండి.... నాకంతేసాలు!"- అంటూనే రిక్షా ఎక్కేసి వెళ్ళిపోయాడు రిక్షావాలా....

* * *

"మరిప్పుడు ఏం చేద్దాం?"- ఆరాత్రి భోజనాల సమయంలో అసలు విషయాన్ని మళ్ళీ ప్రస్తావనకు తెచ్చింది అలివేలు.

"చెయ్యటానికి ఏముందీ?... ఆ సంబంధానికి నీళ్ళ వదిలేసి మళ్ళీ పెళ్లికొడుకుల వేట ప్రారంభించాల్సిందే!"- చెప్పాడు విశ్వనాథం.

"అబ్బాయి లక్షణంగా వున్నాడు-నెలకు రెండువేలు జీతంట!.... అంతో ఇంతో ఆస్తికూడావుంది.... ఇంతమంచిసంబంధం మళ్ళీ మనకి దొరుకుతుందంటారా?"- అలివేలు తన అనుమానాన్ని వ్యక్తంచేసింది.

"దొరికేదానితోనే తృప్తిపడదాం!.... ఏం చేస్తాం?"

తండ్రికి కొంచెం పక్కగా, తలపంచుకుని భోజనం చేస్తున్న అరుణ—తల్లివైపు అదోలా చూసింది...

పిల్లల మనోగత భావాన్ని ఏతల్లైనా ఇట్టే అర్థంచేసుకోగలుగుతుంది.... భగవంతుడు మాతృమూర్తికిచ్చిన వరం అది!...

"అమ్మాయికి—ఆ అబ్బాయి నచ్చాడట!"— భర్తకు నెయ్యి వేస్తూ నెమ్మదిగా చెప్పింది.

విశ్వనాథం మనసుకి సూది గుచ్చుకున్నట్టనిపించింది. ఆమాట కొస్తే ఆ అబ్బాయి తనకూ ఎంతగానో నచ్చాడు... కానీ ఎలా?.... ఏభైవేలు కట్నం కావాలంటున్నారు!... తన ప్రావిడెంటు ఫండు

తాలూకు డబ్బు మహావుంటే పదిహేనువేలుంటుంది! దాంతోటే అరుణ పెళ్ళి చేసేసి తన బాధ్యత తీర్చుకోవాలనుకుంటున్నాడు...మరి వాళ్ల ఏభై వేలు అడిగితే తను ఎక్కణ్ణించి తేగలడు?....

"ఏభై కి పైసా తక్కువైనా వీల్లేదని ఖచ్చితంగా చెప్పేశారు.... ఎక్కణ్ణించి తెమ్మంటావ్ అంతడబ్బు?– భార్యవైపు నిస్సహాయంగా చూశాడు విశ్వనాధం.

బదులు చెప్పలేక–బాధగా తలవంచుకుంది అలివేలు.

నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నట్టే – కట్నాల రేటు కూడా పెరిగిపోతున్నాయి మరి....

"పోనీ ఓపనిచేద్దాం!" – కొన్ని క్షణాల నిశ్శబ్దం తర్వాత హఠాత్తుగా అంది అలివేలు...

"ఏం చేద్దాం?"

"ఇల్లు అమ్మేద్దాం!"

భార్య సలహా బాగానే వున్నట్టుతోచింది విశ్వనాధానికి

నిజమే!...

ఇల్లు అమ్మేస్తే ఎంతలేదన్నా ఓ ఎనభై వేలు వస్తాయి....అందులో యాభైవేలు కట్నం ఇచ్చి మరో–పదివేలు ఖర్చుపెట్టి అరుణ పెళ్ళి ఘనంగా చేయచ్చు.... తక్కిన ఇరవై వేలూ ఫిక్సడ్ డిపాజిట్‌లో వేసుకుంటే దానిపైవచ్చే వడ్డీ డబ్బుతో వేరే ఇంట్లో అద్దెకు వుండచ్చు.... ముఖ్యంగా తనకు నచ్చినవాడితో అరుణ సుఖపడుతుంది!...

అలివేలు బుర్ర బాగానే పనిచేసింది... ఈ ఆలోచన తనకు రానేలేదు...

"మనవీధిలో తాసిల్దారుగారు ఎదైనా ఇల్లు బేరానికి వస్తే కొనా లని అనుకుంటున్నారట! మొన్న మాటల సందర్భంలో పక్కింటి పిన్ని గారు చెప్పారు!" తన సలహా భర్తకు నచ్చిందన్న నమ్మకం కుదర టంతో మళ్ళీ చెప్పింది అలివేలు.

"సర్లే! రేపు తాసిల్దారుగారితో మాట్లాడుతాను!"- అన్నాడు విశ్వనాధం చేయి కడుక్కుంటూ.

తండ్రికి మరో పక్కన కూర్చుని భోజనం చేస్తూనే - వాళ్ళ సంభాషణ వింటున్న విశ్వనాధం కొడుకు, మురళి హఠాత్తుగా అడిగాడు-

"రెండో అక్క పెళ్ళికోసం వున్న పొలం అమ్మేశారు... ఇప్పుడు మిగిలిన ఈ ఒక్క ఇల్లు అమ్మేస్తే రేపు నాకేం మిగుల్తుంది"

ఆ ప్రశ్న వినగానే అందరూ ఒక్కసారిగా త్రుళ్ళిపడ్డారు. కొడుకు అలా నిలదీసి అడుగుతాడని విశ్వనాధం ఊహించలేదు.

"నీకేమిట్రా...మగాడివి! ఈ ఏటితో డిగ్రీ చేతికొస్తుంది!.... ఏదో ఒక ఉద్యోగం సంపాదించుకుని నీ కాళ్ళ మీద నువ్ నిలబడచ్చు!"- ఆ షాక్ నించి ఎలాగో తేరుకుని చెప్పాడు విశ్వనాధం.

"ఎమ్మేలకే దిక్కూ దివాణం లేకుండా పోతోంది... బోడి బిఏ గాడికి ఎవడిస్తాడు ఉద్యోగం?.. అయినా ఈ ఇల్లు తాతగారిది దీనిమీద నాకూ హక్కుంటుంది... అందుకే అమ్మటానికి వీల్లేదంటు న్నాను. అంతగా కావాలంటే ఎక్కడైనా అప్పుతెచ్చి అరుణక్క పెళ్ళి చేయండి!... నెమ్మదిగా తీర్చుకోవచ్చు!"- మురళీ కొంచెం తీవ్రం గానే అన్నాడు...

విశ్వనాథం తలవంచుకుని తన గదిలోకి వెళ్ళిపోయాడు.... మంచంమీద నడుం వాల్చాడేకానీ - ఎప్పటికీ కంటిమీదకు కునుకే రావటంలేదు... మురళీ మాటలు పదే పదే గుర్తుకొచ్చి మనసును కలవరపెడుతున్నాయి ..

వరసగా ఆడపిల్లలు పుట్టుకొస్తూంటే-వంశాన్ని నిలపటానికి ఒక్క మగనలుసైనా కావాలని ఎంతగానో తపించిపోయి ఎందరుదేవుళ్ళకో మొక్కుకున్నదీ—ఎన్ని పుణ్యక్షేత్రాలో సందర్శించిందీ ఇందుకేనా ?" ఇవాళ ఆ మగనలుసుచేత ఇంతటి మాట అనిపించుకోటానికేనా !

'మగపిల్లలు మనల్ని ఉద్ధరిస్తారని గేరంటీ ఏటి బాబూ?'— రిక్షావాలా ఎంత బాగా ఊహించాడు?....

తన చెల్లెల్ని కన్నబిడ్డకంటే మిన్నగా చూసుకుంటున్నాడు.... ఆ చెల్లెలు సుఖంకోసం అవసరమైతే తనఇల్లూ, రిక్షా, అన్నీ అమ్మేస్తాడు.

అరుణ పెళ్ళికోసం అవసరమై- ఇల్లు అమ్మతానంటే— ససేమిరా వీల్లేదంటున్నాడు మురళీ !

ఇద్దరూ ఓ ఆడపిల్లకి తోడపుట్టిన వాళ్ళే !

కానీ ఇద్దరి ఆలోచనల్లోనూ ఇంతటి వ్యత్యాసం ఎందుకు వచ్చింది మరి ?...

అసలు మనిషికి సంస్కారం ఎలా వస్తుంది ? చదువువల్లా ?... సంపదవల్లా ?.... కులంవల్లా ?.... గుణంవల్లా?.... మతంవల్లా?.... ఎలావస్తుంది ?....

రిక్షావాలా చదువుకోలేదు....

మురళి బి. ఏ. చదివాడు !

ఇద్దరి ఊహల్లోనూ ఎంత భేదం వుంది ?...

చూడటానికి ఉప్పు— కర్పూరం ఒక్కలాగే వుంటాయి...

ఉప్పు అందరికీ అవసరం వుండచ్చు...

కానీ— కర్పూరం మాత్రం దేవుడికే కావాలి !!....

పల్లకి—